క్లుప్తంగా

సన్మానం



జాన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఇల్లెందు: ప్రతీ ఉద్యోగి తాను అందించే సేవలకు తోడ్పాటుగా గుర్తింపు, అభినందనలు అందుతాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు అన్నారు. కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్ ఇటీవల ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నీరజ, భాను ప్రసాద్, సోమేశ్వరరావు, ఉమాశంకర్, జగదీశ్వర్, వీరభద్రం, రఘు, శైలజ, జగన్, వేణుగోపాల్, విలియం ప్రసాద్, రజిని, వెంకట్, ఉమామహేశ్వరీ, కవిత, సత్యనారాయణ, చైతన్య, మంజుల, బాలాజీ, భూపాల్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



టీవీ అందజేస్తున్న కోటేశ్వరరావు

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం ప్రాథమికోన్నత పాఠశాలకు డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు మంగళవారం టీవీని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ టీవీఆర్ఎన్ స్వామి మాట్లాడుతూ.. మండలంలో ఆదర్శంగా రూపుదిద్దుకున్న మాణిక్యారం పాఠశాల అభివృద్ధిలో గ్రామపెద్దల సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, మాజీ సర్పంచ్ మోకాళ్ల కృష్ణ, ఎదల్లపల్లి సత్యం, సత్యం, సూరపాక బాబు, బొర్ర రమేష్, భానుచందర్, లింగన్న, సురేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, సత్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికులకు సమస్యల పరిష్కారానికి బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు, సలహాలు, ఫిర్యాదులకు 9959225959 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌సీహెచ్‌పీ డీవైఎస్‌ఈ కరీముల్లాకు ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌పీ ప్రాంతంలో దుమ్ము బాగా వస్తుండటంతో కార్మికులు అనారోగ్యాలకు గురవుతున్నారని, వాటర్ స్ప్రే చేయాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, యూనిఫాం సమస్యలు పరిష్కరించాలన్నారు. స్పందించిన డీవైఎస్‌ఈ ఏరియా జీఎంతో చర్చించి వీలైనంత త్వరలో పరిష్కారమార్గం చూస్తామన్నారు. ఇంజనీర్ లింగ, గౌస్, కృష్ణమోహన్, క్రాంతికుమార్, కుమార్, సాంబశివరావు, శ్రీను, ఉమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, కొలువురి శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెంచిన మెస్‌చార్జీలు అమలు చేయాలి

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను క్షేత్రస్థాయిలో అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యూ నాయకులు భరత్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యాభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మండలాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులు ఐటీడీఏ ద్వారా అధిక నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక విద్యావ్యవస్థ గాడితప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, లోకేష్, నవీన్, చందు తదితరులు పాల్గొన్నారు.

నిధులు సిద్ధమే.. పనుల్లోనే జాప్యం!

- ముందుకు సాగని జీపీ భవనాల నిర్మాణం
- ఏకాభిప్రాయం కుదరక కదలని సీసీ రోడ్లు
- అనుమతులున్నా అసంపూర్తిగానే బీటీ రోడ్డు



అసంపూర్తిగా నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణం

ఇల్లెందురూరల్: నిధుల మంజూరు లేక నేతలు మంత్రుల చుట్టూ తిరుగుతూ ఏదో ఒక మార్గంలో రాబట్టుకోవడం చూస్తుంటాం. కానీ మండలంలో మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవడంలో స్థానిక నాయకులు మీనామేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

నిధులు మంజూరైనా..

మండలంలోని 29 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 21 పంచాయతీల కార్యాలయ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. బాలాజీనగర్, ఇందిరానగర్ పంచాయతీల్లో రెవెన్యూ అధికారులు స్థలం చూపకపోవడంతో పనులు ఆరంభానికి కూడా నోచుకోలేదు. ఫలితంగా ఇందిరానగర్ పంచాయతీలో కార్యాలయ భవనం లేక గ్రామసభలు పంచాయతీకి అనుకొని ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించి అధికారులు విమర్శలను మూటగట్టుకున్నారు. ఇక సుభాష్‌నగర్ పంచాయతీలో అట్టహాసంగా పనులు ప్రారంభించినప్పటికీ స్థలం విషయంలో వివాదాలు తలెత్తి అర్ధంతరంగా పనులు నిలిచిపోయేలా చేశాయి. చేసిన పనులకు బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా మరికొన్ని పంచాయతీల్లో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి.

అన్ని అనుమతులు ఉన్నా..

మండలంలోని తుంటుబాలుతండా నుంచి పోచారంతండా గ్రామం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు అడ్డుగోడగా నిలిచాయి. మూడేళ్ల క్రితం అటవీశాఖ అనుమతులు మంజూరు కావడంతో నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన సాగాయి. కానీ ప్రజలను అత్యంత ఇబ్బందులకు గురిచేస్తున్న పోచారంతండా కట్టపై పనులు వాతావరణం అనుకూలించక కొంత కాలం, గ్రావెల్ తరలింపులో చోటు చేసుకున్న జాప్యం కారణంగా పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం అంతాబాగానే ఉన్నా సంబంధిత అధికారులు ఆ దిశగా ప్రయత్నం ప్రారంభించకపోవడం విచారకరం.

దారి మళ్లించేందుకు సిద్ధంగా..?

మండలంలోని సుభాష్‌నగర్ పంచాయతీలో 2023–24లో డీఎంఎఫ్‌టీ పథకంలో భాగంగా ఐదు సీసీ రోడ్లకు గాను ఆగస్టులో రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఆయా పనులన్నింటిని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పార్టీకి చెందిన కార్యకర్తలకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టింది. ఇందులో మూడు రోడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయగా రెండు రోడ్లు వాయిదా పడ్డాయి. ఆ తర్వాత ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడంతో రాజకీయ రగడతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉండిపోయిన రూ.10 లక్షల నిధులను తమ మండలానికి కేటాయించాలని టేకులపల్లి మండలం నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వద్దకు అర్జీ చేరినట్లు సమాచారం. స్థానిక నాయకులు మేల్కొని పనులు పూర్తి చేయని పక్షంలో నిధులు దారిమళ్లే ప్రమాదం లేకపోలేదు.



నిధులు మంజూరైనా వేయని రోడ్డు

పూర్తి చేస్తాం..



అందుబాటులో నిధులు ఉన్నా నిలిచిపోయిన పనులను గుర్తించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తుంటుబాలు తండా– పోచారం తండా రహదారిలో చెరువుకట్టపై మాత్రమే పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో చెరువులో నిండా నీళ్లు ఉండటంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం నీరు తగ్గుముఖం పట్టింది. త్వరితగతిన పనులు ప్రారంభిస్తాం. ఇందిరానగర్, బాలాజీనగర్, సుభాష్‌నగర్ పంచాయతీలలో స్థలంపై స్పష్టత వస్తే పనులు ప్రారంభిస్తాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్, ఇల్లెందు

సూపర్‌బజార్లను అభివృద్ధి చేయాలి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలో సూపర్ బజార్లను అభివృద్ధి చేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి కొత్తగూడెంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గతంలో సూపర్ బజార్లలో అన్ని రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకురావడమే కాక పర్యవేక్షణకు అధికారులను నియమించారని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ఇకనైనా సూపర్‌బజార్లను ఆధునికరించాలని, రామవరం సెంటర్‌లోని పాత సూపర్ బజార్‌ను సైతం అందుబాటులో తీసుకురావలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, వంగా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

- సింగరేణిలో సమాచార హక్కు చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అధ్యక్షుడు బండ శ్రీధర్‌రెడ్డి సీఎండీ ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. వాసాల మురళీమోహన్, రేవంత్, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు

హెల్త్‌కార్డులు పొందండి



మాట్లాడుతున్న జీఎం

ఇల్లెందు: సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ కార్మికులు, ఉద్యోగులు తక్షణం హెల్త్ కార్డులు పొందాలని ఏరియా జీఎం వి.కృష్ణయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు హెల్త్‌కార్డులు పొందని వారికి యాజమాన్యం చివరి అవకాశం కల్పించదన్నారు. సీపీఎంఆర్ఎస్, ఎన్ఈ అభ్యర్థిత్వం పొందుటకు రూ.60 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 31 లోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారుణ్య నియామకాలకు ముఖాముఖి..

ఇల్లెందు ఏరియా జీఎం వి. కృష్ణయ్య ఆదేశాల ప్రకారం కారుణ్య నియామకాలకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు జీఎం కార్యాలయంలో ముఖాముఖి నిర్వహించారు. ఎస్ఓటూజీఎం బి. వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులకు ఉద్యమిద్దాం

ఇల్లెందురూరల్: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ తన ఫాసిస్టు పాలనతో అన్ని వర్గాల ప్రజలపై దాడులు కొనసాగిస్తున్నారని, ఇలాంటి తరుణంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రజలను సంఘటితం చేసి శ్రేణులు ఉద్యమించాలని మాస్‌లైన్ జాతీయ నాయకురాలు రాయల రమ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మాస్‌లైన్ మండల శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ మాట్లాడుతూ.. సమాజంలో వస్తున్న మార్పులను గమనించి, వాటిని నిరంతరం అధ్యయనం చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమాలు నిర్మించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకు ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. నాయిని రాజు, ముద్దా భిక్షం, ఈసం శంకర్, బోసు, పూనెం కుమార్, ఆజ్మీర బిచ్చా, బుర్ర వెంకన్న, సావిత్రి, అజయ్, ఆవుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమ

పాఠశాల వార్షికోత్సవం

పాల్వంచ: పట్టణంలోని నవభారత్ పాఠశాల వార్షికోత్సవాన్ని నవనగర్‌లోని నవకళా భారతీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్ వి.కామాక్షి ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, పి.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

గ్యారంటీల అమలులో విఫలం



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

టేకులపల్లి: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమయిందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్య హర్యా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం తొమ్మిదోమైలుతండాలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి కేసీఆర్ పాలనను నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. హామీల అమలుకు ఫిబ్రవరి 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. చంద్య, భద్రు, తారాచందు, హతీరాం, భాషా పాల్గొన్నారు.

నివాళి..

ఇల్లెందురూరల్: పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న మరణం కార్మికోద్యమానికి తీరని లోటు అని పీవైఎల్ నాయకుడు వాంకుడోత్ మోతీలాల్ అన్నారు. మండలంలోని పోచారం తండా పంచాయతీ కార్యాలయ ఆవరణలో జటంగి వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మ, రాజా, సుమన్, మంచ అలివేలు, బికి జయమ్మ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలి



పాల్వంచ: పత్రాలు దహనం చేస్తున్న నాయకులు



టేకులపల్లిలో నిరసన..

పాల్వంచ: నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న యునిఫైడ్ ఫెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ మార్చి2న నిర్వహించే చలో హైదరాబాద్‌కు తరలిరావాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో యూపీఎస్ గెజిట్ పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, రామకృష్ణ, రఘురాం, నరసింహారావు, చిరంజీవి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు మండల కేంద్రంలో యూపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేశారు. నాగునాయక్, రమణ, ఫుల్సింగ్, వీరన్న, రమేష్, హతీరామ్, మోహన్, రవి, బాలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న మధుమోహన్‌రెడ్డి

సుజాతనగర్: గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ అంధకారంగా మారుతుందని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో జరిగే నష్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగంతో నేడు యువత భవిష్యత్ ప్రమాదంలో ఉందని, ఈ ప్రమాదం బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకనుగుణంగా శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం.రమాదేవి, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

గోర్‌బోలీను అధికారిక భాషగా గుర్తించాలి



ఇల్లెందు: మాట్లాడుతున్న రమేష్‌నాయక్



సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

ఇల్లెందు: రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్‌బోలీ భాషను చేర్చాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మాణం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు. ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. నాయకులు బన్సీలాల్, మోహన్‌నాయక్, పూర్ణచందర్‌నాయక్, నవీన్ నాయక్, జీవన్ నాయక్, బాబూరావు, భద్రూ నాయక్ పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతిపత్రం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా మార్కెట్ లైసెన్స్ పొందిన వారి లైసెన్సులను రద్దు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఆర్డీఓ మధుకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ జారీచేసిన జీఓ నంబరు 58 ప్రకారం ఏన్కూరు మార్కెట్ పరిధిలోని జూలూరుపాడు మండలంలో గిరిజనేతరులు లైసెన్స్ పొందారని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు వ్యాపారం చేసే హక్కులేదని చట్టం చెబుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్, లంబాడీ విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య కుమార్, నాయకులు హరి, సేవాలాల్‌సేన జిల్లా ప్రధానకార్యదర్శి జరపల లచ్చు, గుగులోత్ బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న రమాకాంత్

సింగరేణి(కొత్తగూడెం): రిటైర్డ్ కార్మికులు వారి సమస్యల పరిష్కారానికి సంఘటితమై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సింగరేణి పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మండా రమాకాంత్, కార్యదర్శి మాధవనాయక్ అన్నారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో అసోసియేషన్ ఆత్మీయ సమావేశం మంగళవారం టీవీ సూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఆర్ఎంఎస్ ఎన్ఈలో సభ్యులు కానీ వారు సభ్యులుగా నమోదు చేసుకోవటానికి మార్చి 31 వరకు 60 వేలు చెల్లించి నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం సింగరేణిలో రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా సంఘం చందర్, ఏరియా కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే.రాజమౌళి, కుమారస్వామి, మాధవ రెడ్డి, టీ.పీవీ శివరావు, అల్లి ప్రకాశ్ లతోపాటు మరికొంత మందిని సహాయ కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. లట్టి జగన్మోహన్‌రావు, టి.నరేంద్ర బాబు, ప్రకాశ్, మనోహర్, చంద్రారెడ్డి, గురుమూర్తి, టీఎస్ పవన్, మొగిలిపాక రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓ ప్రభుదయాళ్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశంలో నిర్వహించారు. ప్రభుత్వం సూచించే ప్రతీ కార్యక్రమాన్ని, పథకాన్ని విధిగా అమలు చేయాలన్నారు. అపార్ నమోదుకు తక్షణ ప్రాధాన్యతను ఇస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈ నెల 30 లోపు అందరి విద్యార్థులను అపార్‌లో నమోదు చేయాలన్నారు. ప్రత్యేక తరగతుల్లో సబ్జెక్టు పరంగా సందేహాలను నివృత్తి చేయాలన్నారు. తరగతి గది బోధన సమయంలో ఫోన్లు ఉపయోగించొద్దని, విద్యార్థుల సంక్షేమమే ముఖ్యమని విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సాధ్యమయ్యే రీతుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు, మండల రిసోర్స్ సభ్యులు, సీర్పీలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

జూలూరుపాడు: ఫిబ్రవరి 2న పాల్వంచలో జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని టీపీజీపీడబ్ల్యూయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గోపాల్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో జరిగిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు పని భద్రత కల్పించడంతోపాటు న్యాయమైన వేతనాలు అందించాలన్నారు. టీపీజీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, టీయూసీఐ జిల్లా కార్యదర్శులు మధుసూధన్‌రెడ్డి, యాకుబ్‌షావలి హాజరయ్యే జిల్లా మహాసభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాజశేఖర్, రాయల సిద్దు, తెల్లం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు: అచ్చంపేట మార్కెట్ కార్యదర్శిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇల్లెందు మార్కెట్ చైర్మన్ బానోతు రాంబాబు, కార్యదర్శి నరేష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఇల్లెందులో మార్కెట్ ఉద్యోగులు దాడి చేసిన ఉద్యోగులను శిక్షించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ ఉద్యోగులు, గార్డులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ములుగు విద్యార్థులు



కిన్నెరసాని అభయారణ్యంలో విద్యార్థులు

పాల్వంచ: మండలంలోని కిన్నెరసాని అభయారణ్యాన్ని ఎఫ్‌సీఆర్ఐ ములుగు విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మందిరకలపాడు సెక్షన్ పరిధిలోని 18 హెక్టార్ల ఎన్‌టీఎస్‌హెచ్ ప్లాంటేషన్, నిర్వహణ, పాత చెక్‌డ్యాంలను, కిన్నెరసాని వన్యప్రాణుల అభయారణ్యాన్ని సందర్శించారు. ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.